క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జడ్చర్ల: మండలపరిధిలోని మాచారంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ కేపీ నిరీక్షణ రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులంలో కెమిస్ట్రీ, గణితం, మైక్రో బయాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ మేరకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పోస్టులకు సంబంధించి 13న డెమో ఉంటుందన్నారు. అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. మిగతా వివరాలకు 8074582331 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కురుమూర్తిగౌడ్ నియామకంపై హర్షం

మహబూబ్‌నగర్ క్రీడలు: తమిళనాడులోని మధురైలో బుధవారం నుంచి ఈనెల 20 వరకు జరిగే మాన్‌సూన్ సీజన్ యువ కబడ్డీ లీగ్‌లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర పురుషుల జట్టుకు కోచ్‌గా జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈ.కురుమూర్తిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.జగదీశ్వర్ యాదవ్ నియామకపత్రం జారీ చేశారు. కురుమూర్తిగౌడ్ నియమితులు కావడం పట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.శాంతికుమార్, చైర్మన్ కేబీ.శ్రీరాములు, సభ్యులు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఎంప్లాయ్‌మెంట్ కార్డుల ఫ్రీ రిజిస్ట్రేషన్

జడ్చర్ల టౌన్: స్థానిక బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎంప్లాయ్‌మెంట్ ఫ్రీ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆధ్వర్యంలో ఉచితంగా రిజిస్ట్రేషన్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రిజిస్ట్రేషన్ల నమోదుపై అవగాహన కల్పించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి హజారుద్దీన్, ప్రిన్స్‌పాల్ చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై మేనిఫెస్టోలో పేర్కొనాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యారంగం అభివృద్ధి కోసం ఏం చేస్తాయో అన్ని పార్టీలు మేనిఫెస్టోల్లో తెలపాలని పీడీఎస్‌యూ నాయకుడు రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యను ప్రభుత్వాలు కార్పొరేట్ పరం చేస్తున్న నేపథ్యంలో పేదవాడికి భారంగా మారిందన్నారు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కచ్చితంగా మేనిఫెస్టోలో పేర్కొనాలన్నారు.

బీజేపీలోకి వెన్న ఈశ్వరప్ప!

గండేడ్: మండల పరిధిలోని వెన్నాచెడ్ గ్రామానికి చెందిన లింగబలిజ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప బీజేపీలోకి వెళ్తున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న అభివృద్ధి, ప్రధాని నరేంద్రమోదీ దేశ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి చూసి ఆకర్షితుడైనట్లు వివరించారు. ఈమేరకు ఈనెల 12న హైదరాబాద్‌లోని నాంపల్లి కార్యాలయంలో పార్టీలో చేరుతున్నట్లు వివరించారు.

ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది



అడ్డాకుల: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ ఏవీఎస్ రాజు అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి గెస్ట్ హౌస్‌లో మంగళవారం జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలపై జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, నియోజకవర్గ నాయకులు ఎగ్గని నర్సిములు, సుదర్శన్ రెడ్డి, బాలమణెమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నంబిరాజు, మాధవరెడ్డిలతో చర్చించారు. బీఆర్ఎస్‌పై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకుని ఎన్నికల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మేరా మిట్టి మేరా దేశ్ అమృత కలశాన్ని జిల్లా అధ్యక్షుడికి నాయకులు అందజేశారు. ఈనెల 11 నుంచి 30వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్, రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, రాంరెడ్డి, రవీందర్, దశరథ, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళిపై సమీక్ష



మూసాపేటలో సమీక్ష చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న బీఎల్‌ఓలు

అడ్డాకుల: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున నియమావళిని పకడ్బందీగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.శ్రీనివాస్ సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నియమావళిపై మండల అధికారులు, కార్యదర్శులతో ఆయన సమీక్ష చేశారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూప, ఎంపీఓ సరోజ, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఓటర్ల పరిశీలనలో బీఎల్‌ఓలు

భూత్పూర్: ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల కావడంతో మంగళవారం బీఎల్‌ఓలు ఓటర్ల పరిశీలన చేస్తున్నారు. 2023 జనాభా లెక్కల ప్రకారం మండలంలోని 48 పోలింగ్ కేంద్రాలు ఉండగా 34844 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 17,423, పురుష ఓటర్లు 17,421 మంది ఓటర్లు ఉన్నారు. ఆన్‌లైన్‌లో ఓటర్లుగా దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తు ఫారాలను బీఎల్‌ఓలు పరిశీలిస్తున్నారు.



దేవరకద్రలో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మంగౌడ్

అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించాలి

దేవరకద్ర: అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని దీని కోసం బీఎల్‌ఓలు శ్రద్ధతో పని చేయాలని తహసీల్దార్ కె.బ్రహ్మంగౌడ్ సూచించారు. మంగళవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో విడతగా ఈ నెల చివరి వరకు కొత్త ఓటర్ల నమోదు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారి నుంచి దరఖాస్తులు తీసుకుని ఓటు హక్కు కల్పించాలని కోరారు. అలాగే ఇతర సమస్యల కారణంగా ఓటు హక్కు కోల్పోయిన వారి నుంచి కూడ దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎలాంటి కార్యక్రమాలు జరిగిన అధికారుల దృష్టికి తీసుకురావాలని వారిని కోరారు. సమావేశంలో డీటీలు శివరాజు, రహమాన్, ఆర్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నగదు లావాదేవీలపై అవగాహన అవసరం

నవాబుపేట: ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున్న నిబంధనలకు మించి నగదుతో ప్రయాణించటం నేరం అవుతుందని... ప్రజలు నిబంధనలు విస్మరించకుండా సహకరించాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల విషయంలో అన్ని పార్టీలు సమయస్ఫూర్తితో నడుచుకోవాలన్నారు. ప్రభుత్వ వాహనాలు రాజకీయ పార్టీల ప్రయోజనాలకు ఉపయోగించరాదన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు రాజకీయ పార్టీల పోస్టర్లు బ్యానర్లు ఉండకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ప్రచారానికి ఉపయోగించరాదన్నారు. అలాగే మండల సరిహద్దులో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

విద్యార్థులకు అభినందన



అడ్డాకుల: పోల్కంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ధర్మతేజ, బోల శివయ్య రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం నాగయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు నిరంజన్‌రావు మంగళవారం తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే 67వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గద్వాల జిల్లా చింతలకుంటకు చెందిన హరీష్‌రెడ్డి ఎంపికయ్యాడు. మంగళవారం కళాశాలలో విద్యార్థిని కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించి శాలువాతో సత్కరించారు. రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో రాణించాలని కోరారు.



కటౌట్లు, పోస్టర్ల తొలగింపు

- గోడల మీద రాతలపై సున్నం పూతలు
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్యలు

దేవరకద్ర: తెలంగాణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించిన నేపథ్యంలో.. అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేసే పనులు చేపట్టారు. నియోజకవర్గ కేంద్రంలో ఇప్పటికే వివిధ పార్టీల కటౌట్‌లను తొలగించారు. గోడలపై వేసిన రాజకీయ నాయకుల పోస్టర్లను తీసివేయిస్తున్నారు. అలాగే గోడలపై నాయకులకు జిందాబాద్‌లను కొట్టి రాతలపై సున్నం పూతలు పూశారు. సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమలు అవుతున్నట్లు కేంద్రం ప్రకటించడంతో అధికార పార్టీ నేతలు ప్రారంభోత్సవాలను, శంకుస్థాపనలను సైతం నిలిపి వేశారు.



దేవరకద్రలో ఆర్వోబీ పిల్లర్‌పై పోస్టర్ తొలగింపు చేస్తున్న సిబ్బంది

కేసీఆర్‌కు అండగా నిలుద్దాం

భూత్పూర్: సీఎం కేసీఆర్‌కు మరోసారి అండగా నిలుద్దామని మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు మనిమోని సత్యనారాయణ అన్నారు. పోతులమడుగులో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. మాజీ ఎంపీటీసీ రమేష్ చందర్, పోలీస్ వెంకట్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మూసాపేటలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కె.శ్రీనివాసులు

అడ్డాకుల: సైబర్ నేరాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. కనీస అవగాహన కలిగి ఉండాలని మూసాపేట ఎస్ఐ కె.శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని ఠాణా వద్ద మంగళవారం సైబర్ నేరాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎవరు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని చెప్పారు. సైబర్ నేరానికి గురైతే 1930 లేదా 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బ్యాంకు ఖాతాలో డబ్బులను పోగొట్టుకున్న వారు 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులను రికవరి చేసే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు కృష్ణ, సురేష్ ఉన్నారు.

కాండం తొలిచే పురుగును నివారించాలి



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న ఏఓ నరేందర్

రాజాపూర్: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి నరేందర్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు ముదిరెడ్డిపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిపైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తున్నదని దాని నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్4జీ 8 కిలోలు లేదా క్లోరాంటనీలోప్రోల్0.4 జీ గుళికలు 4కిలోలు కలిపి పలుచగ నీటిని కట్టివేయాలన్నారు. అంతేకాకుండా ఎకరాకు 3 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆకుముడత, మజ్జిగ తెగులు కూడా ఆశించే అవకాశముందని దాని నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏఈఓ శ్రీనివాస్ రైతులు బుగ్గయ్య, నర్సింలు తదితరులు ఉన్నారు.

కూచూర్, దొడ్డిపల్లిలో పాలలొల్లి



దొడ్డిపల్లిలో పాలు పోస్తున్న పాడి రైతులు

నవాబుపేట: జడ్చర్లలోని విజయ డైరీ నిర్వాహకులు తమకు పాలు వద్దని చెప్పడంతో మండల పరిధిలోని కూచూర్, దొడ్డిపల్లి గ్రామాల పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం దాదాపుగా 600 లీటర్ల పాలను తాము అందిస్తుంటామని..ఉన్నట్టుండి వద్దనడంతో తమ బతుకుదెరువు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూచూర్ నుంచి దాదాపుగా 45 మంది, దొడ్డిపల్లి నుంచి 32 మంది నిత్యం ఉదయం, సాయంత్రం 600 లీటర్ల పాలు డైరీ అందిస్తుంటామని వివరించారు. ఇన్ని రోజులు బాగానే ఉన్నా.. ఇప్పుడు పాలు తీసుకునేందుకు ససేమిరా అనటంతో ఆలోచనలో పడ్డామని వాపోతున్నారు. ఈ మేరకు విషయంపై మంగళవారం కలెక్టర్‌కు ఇరు గ్రామాల పాడి రైతులు వినతిపత్రం అందించారు. తమకు న్యాయం చేయాలని వారు కోరారు. కాగా జడ్చర్ల నిర్వాహకులు పాలు వద్దనటంపై గ్రామంలోని ఫిర్యాదులు కారణమై ఉంటాయని.. ఎవరో చెప్తే పాలను మొత్తం తీసుకురావద్దని చెప్పటం ఏంటని ప్రశ్నిస్తున్నారు.


ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలి

భూత్పూర్: మున్సిపాలిటీలోని జాతీయ రహదారిపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని 9వ వార్డు బీసీ కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఇటీవల పాతగేరికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా డీసీఎం ఢీకొని మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాస్తారోకోతో పాటు డీసీఎం డ్రైవర్‌ను చితకబాదడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో సీఐ రామకృష్ణ ఎల్అండ్‌టీ అధికారులతో మాట్లాడి డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా నేటికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గతంలో ఇదే చోట ప్రమాదాలు జరగగా ముగ్గురు మృత్యువాత పడ్డారని స్థానికులు చెబుతున్నారు. నిత్యం డివైడర్ పై నుంచి పాతగేరితో పాటు మున్సిపల్ కార్యాలయం, ప్రార్థన మందిరం వైపు పట్టణ ప్రజలు ప్రతిరోజు డివైడర్ దాటి వెళ్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



భూత్పూర్ జాతీయ రహదారిపై డివైడర్‌ను దాటుతున్న స్థానికులు

మొక్కల పరిశీలన



మహమ్మదాబాద్: మండలపరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామాన్ని మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య సందర్శించారు. గ్రామంలోని పాండురంగ స్వామి ఆలయ సమీపంలో 2017నుంచి దాదాపు 30టేకు మొక్కలను సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం అట్టి మొక్కలను పరిశీలించిన అడిషనల్‌కలెక్టర్ మొక్కలను వాటిని సంరక్షించడం వల్ల గ్రామపంచాయతీకి మంచి సంపద మిగిలిందన్నారు. వీటి పరిశీలన నిమిత్తం భూత్పూర్ నుంచి ఎన్ఆర్ఈజీఎస్ సభ్యులు వచ్చారు. సర్పంచ్, కార్యదర్శి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలతో ప్రజల్లోకి..



తిమ్మాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటి పథకాలతో ప్రజల్లోకి వెళ్తామని డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగ్లారవి తెలిపారు. మంగళవారం యన్మన్‌గండ్లలో మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. నాయకులు షబ్బీర్, మైనోద్దిన్, హమీద్, నవాజ్‌రెడ్డి, రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. తిమ్మాపూర్, పోల్కంపల్లి, చక్రాపూర్, కనకాపూర్ తండాలో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అడ్డాకుల మండలంలో పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, గుడిబండ ఎంపీటీసీ శకుంతల గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేశారు.

ఎన్నికల వేళ.. రెవెన్యూ అధికారుల బదిలీ

మహబూబ్‌నగర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో నియామవళి ప్రకారం సుదీర్ఘకాలంగా సొంత జిల్లాలో పనిచేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులకు స్థానచలనం కలిగింది. తాజాగా అర్బన్ తహసీల్దార్ నాగార్జునను కూడా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. చాలాకాలం పాటు డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌లో స్టాక్ పాయింట్‌లో పనిచేస్తూ పదోన్నతి రావడంతో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇదే జిల్లాలో పని చేసినందున బదిలీ ఉత్తర్వులు వచ్చాయని సమాచారం. అదేవిధంగా రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్యామ్‌సుందర్‌రెడ్డిని జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ చేసినట్లు తెలియవస్తోంది. మూడు రోజుల క్రితమే బదిలీ సమాచారంపై స్పష్టత వచ్చినప్పటికీ అధికారికంగా ఉత్తర్వులు రాలేదంటూ రెవెన్యూ అధికారి ఒకరు తెలిపారు. డీటీ శ్యామ్‌సుందర్‌రెడ్డి బదిలీని నిలుపుదల చేసుకునేందుకు పైరవీ చేస్తున్నట్లు తెలిసింది.

శిలాఫలకం ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

బాలానగర్: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దబాయి తండాలో సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని పలు శిలాఫలకాలను ఆవిష్కరించారు. అయితే గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను తండావాసులు అడ్డుకుని ఆలయ నిర్మాణానికి తోడ్పాటు అందించలేదని వాపోయారు. అంతేకాకుండా తండాకు చెందిన యువకుడు మరణించినా ఎలాంటి సహకారం అందించలేదన్నారు. కాగా వారికి ఆయా విషయాలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని అడ్డుకున్న నేపథ్యంలో పలువురు నాయకులు సర్దిచెప్పారు. ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని వివరించారు. అనంతరం పలు కార్యక్రమాలను కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే ఆవిష్కరించిన సీసీ రోడ్డు శిలాఫలకంతో పాటు మరో శిలాఫలకాన్ని అదే రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పూర్తిగా ధ్వసం చేశారు. ధ్వంసం చేశారు. ఈ విషయంపై సర్పంచ్ తిరుపతి నాయక్‌ను వివరణ కోరగా ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.



ధ్వంసమైన శిలాఫలకం